క్లుప్తంగా

ఎన్నిక

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా వంగాల దయాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలం నుంచి కాంగ్రెస్‌లో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వంగాల దయాకర్‌ను పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడిగా అవదూత కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా అలుగోజు నాగచారీ, కార్యదర్శిగా చీపురు వెంకటస్వామి, కోశాధికారిగా లొంక రాజు, కార్యవర్గ సభ్యులుగా మొగులుగాని శ్రీనివాస్, కన్నీబోయిన సింహాంద్రి, గబ్బెట యాదగిరి, గంగరాజు, ఉప్పలయ్యతో పాటు తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. నాయకులు అన్నెబోయిన భిక్షపతి, పార్టీ నాయకులు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, సదయ్యగౌడ్, నంచర్ల యాదగిరి, అలువాల ప్రభాకర్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

వడ్లమండెపై పందుల దాడి



చిల్పూరు: వానాకాలం పంట కోసం వడ్ల మండెను పోయగా పందులు దాడి చేయడంతో పనికి రాకుండా పోయిందని బాధిత రైతులు తెలిపారు. మండలంలోని నష్కల్‌కు చెందిన శాగంటి మణి, యూద్‌లు అందించిన వివరాల ప్రకారం.. వరినారు తయారీకి ఏపీ సీడ్స్ నుంచి 5 బస్తాలు రూ.5,300 వెచ్చించి తీసుకొచ్చామన్నారు. అదేరోజు వ్యవసాయ బావి వద్ద మండె అలికారు. మంగళవారం రాత్రి మండెకు నీరు పోసి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చేసరికి మండెపై ఇదే గ్రామానికి చెందిన పందులు దాడి చేశాయన్నారు. గతంలోనూ ఇదే విధంగా నారు పోసుకునే దశలో పందులు దాడి చేయడంతో సర్పంచ్ స్వప్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. ఇక పందులను వదలనని చెప్పగా మళ్లీ రావడంతో మండె నారు నష్టపోవాల్సి వచ్చిందని తమకు న్యాయం చేయాలని రైతులు రవి, పిట్టల వెంకటయ్యలు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

చిల్పూరు: మండలంలోని నష్కల్‌కు చెందిన గీత కార్మికుడు బుధవారం ప్రమాదవశాత్తు తాటిపైనుంచి పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే ఉదయం మోడెం చంద్రశేఖర్ కల్లు గీసేందుకు తాటివనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టు పక్కల గీత కార్మికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందివ్వగా చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన గీత కార్మికుడిని ఆదుకోవాలని సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, గీత కార్మిక సంఘం నాయకుడు రంగు రాజులు అధికారులను కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



చిల్పూరు: మండలంలోని ఫతేపూర్ పంచాయతీ పరిధిలోని బట్టుతండా వద్ద బుధవారం విద్యుదాఘాతానికి గురై రూ.70 వేల విలువైన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. బోడబండతండాకు చెందిన బాధిత రైతు జూరుపుల గోవిందు అందించిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే పశువులను మేతకు బట్టుతండాకు తీసుక వచ్చాడు. మంగళవారం రాత్రి గాలి దుమారం, వర్షంతో విద్యుత్ పోలు వంగిపోవడంతో లూపు లైన్ వైర్లు భూమిపై వాలాయి. అవి గమనించని రైతు పశువులను వదలండంతో మేత మేసుకుంటూ రెండు ఆవులు ఆవైర్లను తాకాయి. దీంతో ఒక్కసారిగా అవి కింద పడిపోవడంతో గోవిందు వెంటనే ఓ ఆవును కాపాడగా మరో ఆవు మృతి చెందింది. బాధిత రైతుకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని తండా వాసి బట్టు భిక్షపతి అధికారులను కోరాడు.

కన్నాయపల్లిలో ఏడు గొర్రెలు..



రఘునాథపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు విద్యుత్ ప్రసారమై ఓ పెంపకం దారుడికి చెందిన ఏడు గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని కన్నాయపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెంపకందారుడు నల్గూరి కొమురయ్య తన గొర్రెలను రోజువారిగా మేతకు తోలుకెళ్లాడు. గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు వద్దకు వెళ్లిన గొర్రెలకు విద్యుత్ ప్రసారమై ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. గొర్రెలు ఆకస్మాత్తుగా మృతిచెందడంతో కొమురయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. విద్యుత్ దాఘాతంతో రూ 60 వేల విలువైన గొర్రెలు మృతిచెందాయని బాధితుడు కొమురయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: పెన్షనర్ల అపరిష్కృత సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఘన్‌పూర్ ఏటీఓ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.దస్తగిరి, కోతి భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఏటీఓ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఘన్‌పూర్ ఏటీఓ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రతీ నెలా మొదటి తేదీన పెన్షన్లు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను విడుదల చేయాలని, 2018 వేతన స్కేళ్ల గడువు ముగిసినందున 2023 వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈహెచ్‌ఎస్ కింద అన్ని కార్పొరేట్ వైద్యశాలల్లో నాణ్యమైన వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్‌కు, ఏటీఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్న, ఘన్‌పూర్ ఏటీఓ శాఖ గౌరవ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎం.రాంరెడ్డి, ఎస్.వైకుంఠం, మల్లిఖార్జున్, కొమురయ్య, వెంకటయ్య, యాదగిరి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో ప్రతీ పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో డబుల్‌బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీ, గృహలక్ష్మి పథకంపై బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ విభాగం జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పర్యవేక్షణలో జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి, చిల్పూరు మండలం పల్లగుట్ట, లింగాలఘనపురం మండలం కళ్లెం గ్రామాల్లో మంజూరైన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. గృహలక్ష్మి పథకం, డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ప్రభుత్వ భూముల గుర్తింపు కోసం గ్రామసభలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని, రెవెన్యూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ కృష్ణవేణి, హౌసింగ్ ఈఈ దామోదర్‌రావు, వివిధ మండలాల తహసీల్దార్లు పూల్‌సింగ్‌చౌహాన్, గంగమని, వినయలత, స్వప్న, దేవ్‌సింగ్, రజిని, రాజుతో పాటు హౌసింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



ఆట వస్తువులు అందజేస్తున్న సిద్దులు

బచ్చన్నపేట: క్రీడలతో విద్యార్థులకు నలుగురితో మాట్లాడాలన్న భయం, అపోహలు తొలగి నాయకత్వ లక్షణాలు అలవడతాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు అన్నారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లిలో బేజాడి ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. క్రీడలతో శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కూడా కలుగుతుందన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప జిల్లాలోని అన్ని మండలాల్లో ఆటవస్తువులను అందిస్తున్నారని తెలిపారు. ఇక ముందు కూడా ఈలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను బీరప్ప కొనసాగిస్తారని తెలిపారు. నాయకులు దొమ్మాట శ్రీహరి, మేకల బిక్షపతి, గోల్కొండ నాగరాజు, కరుణాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అన్నదానం



జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో లయన్స్ డిస్ట్రిక్ట్ 320 గవర్నర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. సేవా కార్యక్రమాల విషయంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని లయన్స్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ, లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్య, లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం, లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీ సాయి క్లబ్ ప్రతినిధులు రమేష్, రవీందర్ రెడ్డి, రవి నాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి

కొడకండ్ల: ఇంటి ఆవరణలో నీరు లేకుండా ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఉండేలా చూడాలని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌కు సంబంధించి కేంద్ర బృందాలు మండలంలోని మొండ్రాయి, రామన్నగూడెం, కొడకండ్ల, రంగాపురం గ్రామాల్లో పర్యటించనున్నాయని, మరుగునీరు ఇంటి ఆవరణల్లో ఉండకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అలాగే ఇనిస్టిట్యూషన్లలో కమ్యూనిటీ ఇంకుడుగుంతలను నిర్మించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించి సహకరించేలా చూడాలని, వర్షాలు కురుస్తున్నందున హరితహారం లక్ష్యానికి అనుగుణంగా ఫిట్టింగ్, ప్లాంటింగ్ చేయించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

'ఈటల'ను కలిసిన బీజేపీ నాయకులు



ఈటలతో బీజేపీ నాయకులు

జనగామ: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈటలను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల సత్యం, భువనగిరి పార్లమెంటు కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గుజ్జుల నారాయణ, జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్, పట్టణ నాయకులు సంపత్, వినోద్, క్రాంతి పాల్గొన్నారు.

శాకంబరీ ఉత్సవాలు



జనగామ రూరల్: పట్టణంలోని గుండ్ల గడ్డ ఏరియాలోని శ్రీభక్తాంజనేయ సహిత శ్రీఉమామహేశ్వరాలయంలో బుధవారం దేవాలయ అర్చకులు రాజేష్ భార్గవ ఆధ్వర్యలంలో ఘనంగా శాకంబరీ దేవి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి

బచ్చన్నపేట: ప్రస్తుత వానాకాలంలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో మండలంలోని అన్ని గ్రామాల ఆశ వర్కర్ల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురవడంతో దోమలు పెరుగుతాయన్నారు. దోమలు కుట్టడంతో డెంగీ జ్వరం వచ్చి తలనొప్పి, కనుగుడ్డు నొప్పి, చర్మంపై దద్దుర్లు లాంటివి వస్తూ కండరాలు, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయన్నారు. పై లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని తెలిపారు. అలాగే ఆశలు గ్రామాల్లో తిరిగి జ్వరం, జబ్బులతో బాధపడే వారిని గుర్తించి వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఆశ వర్కర్లు నెల రోజుల్లో గ్రామంలో తిరిగి ఎవరెవరిని కలిసి మందులను ఇచ్చారనే రిపోర్టు నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సృజన, మేరీ స్టెల్లా, ఝాన్సీరెడ్డి, ఎంసీహెచ్‌పీ మమత, ఏఎన్‌ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది బొడ్డు శ్రీనివాస్, శ్వేతతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఆలయ ప్రహరీ



గోడ కూలడంతో నుజ్జయిన ఆటోను చూపిస్తున్న బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామువరకు కురిసిన భారీ వర్షంతో డివిజన్ కేంద్రంలోని బస్టాండ్‌కు సమీపాన ఉన్న శ్రీతిరుమలనాథస్వామి ఆలయ ప్రహరీ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ప్రహరీ పక్కనే నిలిపిన నీల దశరథానికి చెందిన ఆటో, తోపుడుబండి నుజ్జునుజ్జయ్యాయి. అదేవిధంగా నాలుగు విద్యుత్ స్తంభాలు కూలిపోగా కాలనీలోని పలువురు ఇళ్లలోని టీవీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లగా కాలనీలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేదు. ప్రహరీ నాసిరకంగా నిర్మించారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు. కాగా, విషయం తెలుసుకున్న దేవస్థాన ఈఓ వంశీ, వార్డు సభ్యుడు కుంభం నరేందర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుట్టపై నుంచి వర్షపునీరు భారీగా రావడంతో గోడ కూలిందని, త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



రఘునాథపల్లి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది తదితరులు

రఘునాథపల్లి: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవని మండల వైద్యాధికారి కమలహాసన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నివారణ చర్యలపై ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణ, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు రవితేజ, శ్రీతేజ, పర్యవేక్షకులు బిక్కునాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండారి పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

చిల్పూరు: ఈనెల 8వ తేదీన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పుట్టిన రోజు వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ ఉడ్డెమారి రాజ్‌కుమార్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 8న ఉదయం 9 గంటల వరకు మండలంలోని ప్రతీ గ్రామంలో కేకులు కట్ చేసిన అనంతరం కడియం అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. 11 గంటలకు తహసీల్ కార్యాలయం నుంచి మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ మహాఅన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సర్పంచ్‌లు రవీందర్, రూప్లానాయక్, తులసి, యాదగిరి, శ్యాంకుమార్‌రెడ్డి, ఇల్లందుల హరిబాబు, స్వామి, మచ్చ రమేష్, కాందూరి రంగరాజు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: ఈ నెల 8న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక రామాలయంలో సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, రాజేష్‌నాయక్, మోహన్‌రావు, ఆశోక్, పెద్దిరెడ్డి ఉన్నారు.

అమెరికాలో ఎర్రబెల్లి జన్మదిన వేడుకలు



ఎర్రబెల్లి జన్మదిన వేడుకల్లో విక్రమ్‌రెడ్డి తదితరులు

దేవరుప్పుల: అమెరికా వాషింగ్టన్ డీసీలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదినం పురస్కరించుకొని చిన్నమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకులు చామల విక్రమ్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐలు వీరారెడ్డి భరత్‌రెడ్డి, ఎస్.మహేందర్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్‌లో జరిగే ఉత్తర అమెరికా తెలుగు సంఘం 23వ మహాసభల్లో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రి ఎర్రబెల్లికి తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, జగదీష్ ప్రభులు శుభాకాంక్షలు తెలిపి స్వాగత పలికారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె అనివార్యం



సమ్మె నోటీసు అందజేస్తున్న వెంకన్న

దేవరుప్పుల: చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం నేటినుంచి సమ్మె అనివార్యమైందని గ్రామ పంచాయతీ సిబ్బంది, వర్కర్స్ యూనియన్(సీఐటియు) జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న అన్నారు. బుధవారం మండలంలోని కడవెండి తదితర గ్రామాల్లో పంచాయతీ ఉద్యోగులు సమ్మె నోటీసును సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ బస్వ రామచంద్రు, కార్యదర్శి ఎడెల్లి వెంకటర్‌డ్డి, మండల కార్యవర్గ సభ్యులు ఉత్తెపు ఐలయ్య, పైండ్ల వెంకటరమణ, భాషిపాక ఐలయ్య, అంజయ్య, దండెంపల్లి యాదయ్య, పడమటింటి రామచంద్రు, నర్సింహ్మ,ఉప్పలయ్య,ఐలయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చీటింగ్ కేసులో ఇరువురి రిమాండ్

లింగాలఘణపురం: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్లాట్ విక్రయంలో మోసం చేసిన మండలంలోని మాణిక్యాపురానికి చెందిన చౌదరి శేఖర్, కొత్తపల్లికి చెందిన మనోహర్‌లపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. నవాబుపేటకు చెందిన తీగల శ్రీనివాస్‌కు నెల్లుట్ల చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఒకసారి, ఇదేందని ప్రశ్నిస్తే దేవాదుల కెనాల్ వద్ద భూసేకరణలో పోయిన ప్లాట్ రెండోసారి విక్రయించారని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఏం చేసుకుంటారో చేసుకోండని, డబ్బులు ఇచ్చేది లేదని మోసం చేయగా బాధితుడు శ్రీనివాసు ఫిర్యాదు మేరకు సెక్షన్ 406, 420, 386 రెడ్/విత్ 34 ఐపీసీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వివరించారు.

పరామర్శ

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చాట్ల డానియల్ తండ్రి సాయిలు అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఎంపీపీ మేకల కళింగ రాజు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఎడ్ల శ్రీనివాస్, భూరెడ్డి ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్, మాజీ ఎమ్మెల్యే బొజ్జపల్లి రాజయ్య సతీమణి లక్ష్మి(65) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. కాగా, ఆమె మృతిపట్ల బీజేపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జఫర్‌గఢ్: ఉప్పుగల్లుకు చెందిన కస్తూరి సారమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును బీఆర్‌ఎస్ మండల జాయింట్ సెక్రెటరీ పులి ధనుంజయ బుధవారం అందజేశారు. కోరుకొప్పుల రాజు, బొల్లెపల్లి రాజు, కస్తూరి రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకోవద్దు

పాలకుర్తి: మైనర్లను పనిలో పెట్టుకోకూడదని బాలల పరిరక్షణ సమితి అధికారి ప్రకాశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆపరేషన్ ముస్కాన్-09లో భాగంగా బట్టల షాపులు, హోటల్స్, టూ వీలర్స్, షోరూంలలో ఆయన తనిఖీ చేశారు. మైనర్లను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



పాలకుర్తి టౌన్: మండలంలోని పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రచ్చ ఆకాంక్ష భాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లుగా హెచ్‌ఎం పాయం శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ జీడి సమ్మయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు గంట రవీందర్‌లు ఆకాంక్షను సన్మానించారు. ఉపాధ్యాయులు ఓరుగంటి రవిందర్, ఉప్పలయ్య, మాలతి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి ఎక్సలెన్స్ అవార్డులు

పాలకుర్తి: రాష్ట్ర దివ్యాంగుల సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన నలుగురు ఎక్సలెన్స్ అవార్డుల అందుకున్నారు. బుధవారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులు టీఆర్‌పీఎస్ ఫౌండర్ మహ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో టీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఎల్లయ్య, ఆంజయ్య, రెడ్యా నాయక్ ఉన్నారు.

నాసిరకంగా నిర్మాణ పనులు



కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

తరిగొప్పుల: మండలకేంద్రం నుంచి జనగామ వెళ్లే మార్గంలో పెద్ద చెరువు పెద్దమత్తడి వద్ద ఆర్‌అండ్‌బీ నిధులతో చేపట్టిన కల్వర్టు నిర్మాణం పనులు నాసిరకంగా చేపడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణం పనుల్లో చేతివాటం చూపిస్తూ జేబులు నింపుకోవాలని చూస్తున్నాడు. నిబంధనల ప్రకారం కల్వర్టు నిర్మాణంలో భాగంగా వేసిన పైపుల మధ్యలో రెడీ మిక్స్ పోయాల్సి ఉండగా మొరం మట్టి పోసి నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాడు. రెడీ మిక్స్‌కు బదులు మట్టి పోయడంతో భవిష్యత్‌లో కల్వర్టు కుంగిపోయే ప్రమాదం ఉంటుంది. చాలా ఏళ్లుగా వర్షాకాలంలో పెద్దమత్తడి పొంగి ప్రవహిస్తే వారం రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయేవని, కల్వర్టు నిర్మాణం పనులు ఆగమేఘాల మీద చేస్తు నాసిరకంగా నిర్మాణం చేపట్టడం సరికాదని నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజాహితానికే దండోరా ఉద్యమం



స్టేషన్‌ఘన్‌పూర్: గత 29 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ రుగ్మతలను తొలగించి ఆధిపత్యం, పెత్తనం లేని నూతన వ్యవస్థ నిర్మాణం, ప్రజా సంక్షేమం కోసం అనేక ఉద్యమాలను నడుపుతూ మాదిగ దండోరా ఉద్యమం ప్రజాహితం కోసం అంకితమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ అన్నారు. ఈనెల 7న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ సభ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో వరంగల్‌కు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.